# ప్రిన్స్ హెమింగ్వే



అల్లం శేషగిరిరావు తన కథలలో ప్రకృతిలోని స్వచ్ఛతను అందుకోవాలని మనిషి పడే ఆరాటాన్ని ప్రతిబింబిస్తారు.

బయట చీకటిగానే ఉంది.

ఆకాశం మీద వేగుచుక్క పొడిచి పాలిపోతున్న చంద్రుణ్ణి వెక్కిరిస్తున్నట్లు గదిలో శాండ్లియర్స్ కాంతి మెత్తగా పరుచుకొనుంది. హెమింగ్వే మీద రాసిన వ్యాసం చదివాడు. బాగానే ఉంది. ఎందుకో గాని ఆ రాతలో మేధోవిశ్లేషణ తప్ప హృదయ స్పందన లేదనిపించింది.

సాలోచనగా కళ్ళు మూసుకున్నాడు. "మేన్ కెన్ బి డిస్ట్రాయ్డ్, బట్ కెనాట్ బి డిఫీటెడ్."

అలా ప్రతిరోజూ వేకువజాములో ప్రశాంతంగా పుస్తకాలు చదవడం రవీంద్రకు అలవాటు. రవీంద్ర ఆక్స్‌ఫర్డ్‌లో చదువుకున్నాడు. ఆంగ్ల సాహిత్యంతో పాటు పాశ్చాత్య సంస్కృతిని ఆకళింపు చేసుకున్న ఇండియన్ ప్రిన్స్.

"హుజూర్, చాయ్." నౌకరు రసూల్ పిలుపుతో కళ్ళు తెరిచాడు.

టేబుల్ మీద వేడి టీ, ట్రేలో హవానా సిగార్.

"రాణీసాహెబా...?"

"నిద్రపోతున్నారు. హుజూర్" అని రసూల్ మర్యాదపూర్వకంగా రెండడుగులు వెనక్కు వేసి సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు. మంచం మీద నుంచే బెడ్ టీ తాగి, హవానా సిగార్ కొనను పంటితో కొరికి, నాలుకతో తడుపుతూ మేలిమి పొగాకు చేదు రుచిని చప్పరిస్తూ సిల్వర్ లైటర్‌తో వెలిగించాడు. ఆ వెలుగులో డెబ్బైవ పడిలో పడుతున్న రవీంద్ర ముఖం ముడుతలుదేరి కణతల మీద ఉబ్బిన నరాలతో రాచరికపు హుందాతో జిగేల్‌మని మెరిసింది.

హవానా సిగార్ కాలుస్తూ, ఘాటైన మత్తు పొగల్ని ముద్దలు ముద్దలుగా వదులుతున్నాడు. ఆ పొగలు నున్నటి మీగడ రంగు గోడల మీదినుంచి ప్రతిఫలిస్తున్న విద్యుత్ కాంతితో కలసి గదంతా అలుముకొంటూ ఖరీదైన పొగాకు వాసనల్ని విరజిమ్ముతున్నాయి. తెల్లటి పొగలో శాండ్లియర్స్ మసక బారుతోంది. అలా సిగార్ కాలుస్తూ చాలాసేపు గతించిన రాచరికపు జ్ఞాపకాల్ని, ఆక్స్‌ఫర్డ్‌ని, వైస్ రీగల్ భవంతుల్ని, పద్మానది మీద పడవ ప్రయాణాన్ని తెరలు తెరలుగా మననం చేసుకుంటూ పక్క మీది నుంచి లేచి మంచం దిగాడు. నైట్ గౌన్ సర్దుకుని, మంచానికి తగిలించిన బంగారు పొన్ను చేతి కర్రను తీసుకొని ఎదురుగా ఉన్న అద్దంలో తన నిండైన విగ్రహాన్ని చూసుకున్నాడు. అంత వయసు లోనూ సన్నగా, నిటారుగా, పాత బడి పసుపుదేరిన ఏనుగు దంతంతో చెక్కిన శిల్పంలా ఉన్నాడు. ముఖం ప్రశాంతంగా ఉన్నా గద్దముక్కులాంటి వంగిన ముక్కు, ఎర్రటి జీరలు తేరిన కళ్ళలో చూపులు అతని పట్టుదలను, నివురుగప్పిన రాచరికపు పొగరును, బింకాన్ని చాటుతున్నాయి.

బెత్తంతో కుడికాలు మీద రక్ రక్‌మని మెజస్టిక్‌గా టాప్ చేసుకున్నాడు - కర్రకాలు!


ఠీవిగా కట్టెకాలుతో కుంటుకుంటూ మెట్లెక్కుతూ డాబా మీది బాల్కనీలోకి వచ్చాడు. చేతికర్రను ఊత కర్రలా వాడటంలేదు. కట్టెకాలు కిర్రు శబ్దానికి లయ బద్ధంగా చేతి బెత్తాన్ని స్వింగ్ చేస్తూ నడుస్తున్నాడు. నడకలో కర్రకాలు అవరోధాన్ని గ్రేస్‌ఫుల్‌గా మలచి నడవడం అలవాటు చేసుకున్నాడు. ఆ నడకలో 'మహారాజు' హుందాతో పాటు పాశ్చాత్య ఊపు కలసి ఒక ప్రత్యేక ఆకర్షణను సంతరించుకొంది. అలా మెట్లెక్కి బాల్కనీలో నిలుచున్నాడు. చలిగా ఉంది. ఉండుండి వీస్తున్న పిల్లగాలులకు చలి మరింత చిక్కబడుతోంది. మసక చీకట్లో పొగ మంచు శిథిలావస్థలో ఉన్న తన తాతలనాటి రాజప్రాసాదాన్ని కమ్ముకొంటూ, దాన్ని ఆనుకొనున్న అడవుల్లో నుంచి విస్తరించుకొంటూ ఆకాశపు అంచుల్ని తాకుతోంది.

ఎటు చూసినా ఒరుసుకొంటున్న మంచుపొగలు.

మంచుతో తడిసిన అడవి వాసన.

రవీంద్ర కట్టెకాలుతో ఠీవిగా బాల్కనీలో నిల్చొని కోట బురుజు మీద మంచుపొరల్లో ఊగుతున్న క్షీణచంద్రుణ్ణి చూస్తున్నాడు. ఆ కోటలో ఉన్నప్పుడే తన వివాహం జరిగింది. పెళ్ళికి ప్రిన్స్ ఆఫ్ వేల్స్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. యువరాజు కోసం ప్రత్యేకంగా నిర్మించిన పాలిష్డ్ ఉడెన్ డాన్సింగ్ ఫ్లోర్. అలనాటి ఫాక్స్‌ట్రాట్, వాల్ట్జ్ బాల్ డాన్సులు, పాశ్చాత్య సంగీతం, ఫ్రెంచి పరిమళాలు, విస్కీ వాసనలు ఆ రాజప్రాసాదపు రంగరంగ వైభవాన్ని గుర్తుకు తెస్తున్నాయి.

చిత్రాలు : పి.ఎస్. బాబు



దూరాన కొండల్లో పెద్దపులి అరిచింది. ఆ అరుపుకు రవీంద్ర ఒక్కసారి ఉలిక్కిపడ్డాడు. ఆ అరుపు ఛాలెంజింగ్‌గా ఉంది. వేకువజాము ప్రశాంతతను చీల్చుకుంటూ ఆ అరుపులు కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి. రవీంద్రకు ఆపాదమస్తకం గగుర్పొడుస్తోంది. ఉద్వేగంతో వగరుస్తూ, కర్రకాలు మీద అప్రయత్నంగా బెత్తంతో రెస్ట్‌లెస్‌గా కొట్టుకుంటూ అరుపు వినిపిస్తున్న కొండల్లోకి చూస్తున్నాడు. కొండల మీద మంచు పలచబడుతూ, ఆకాశం మీద మెత్తటి వెలుగు పరుచుకొంటోంది.

పులి అరుపులు రవీంద్రను గతంలోకి నెట్టివేస్తున్నాయి.

పెళ్ళయిన కొత్త రోజులు. ఉత్తర భారతదేశంలో ఒక పేద్ద జమీందారు గారి ఆహ్వానాన్ని పురస్కరించుకొని రెండు వందల పైచిలుకు పెద్దపులుల్ని వేటాడి 'పులిరాజు'గా పేరు తెచ్చుకున్న తన తండ్రిగారు కొడుకును తీసుకొని మృగయా వినోదానికి అస్సాం వెళ్ళారు.

**వేట ప్రారంభ సూచకంగా గాలిలో తుపాకీ పేలింది. 'బీట్' మొదలయింది.**

**తుపాకీ దెబ్బకు ఎత్తి పారేసినట్లు పులి పల్టీ కొట్టి వెనక్కు తుళ్ళి ఆమడ దూరంలో గడ్డిలో పడిపోయింది.**



అస్సాం అడవుల్లో పులివేట. దక్షిణాది వలె గాక అస్సాంలో 'ఏనుగు గడ్డి'తో నిండిన కీకారణ్యాలు. ఆ అడవుల్లో కాలినడకన ఏడెనిమిది అడుగులు పెరిగిన దట్టమైన గడ్డిలో నుంచి పులివేట అసాధ్యం. అందుకే అక్కడ పులుల్ని ఏనుగుల మీద నుంచి వేటాడుతారు. ప్రత్యేకమైన వేట అంబారీలు అమర్చిన సుశిక్షితమైన ఏనుగుల మీద పులివేటలో రాటుదేరిన రాజులు, నవాబులు, జమీందారులు తుపాకులతో ఎక్కి కూర్చున్నారు.

సూర్యోదయం కావస్తోంది. దూరంగా వేట ప్రారంభసూచకంగా గాలిలో తుపాకీ పేలింది. 'బీట్' మొదలయింది. ఏనుగులు బయలుదేరాయి. అడవిలో ప్రవేశించగానే వ్యూహాత్మకంగా విడిపోయాయి. పొజిషన్స్‌లోకి వెళ్తున్నాయి. రవీంద్ర, తన తండ్రి వేర్వేరు ఏనుగుల మీద కూర్చున్నారు.

"రవీ, నువ్వు 'క్రేక్‌షాట్'వి. అందుకు తిరుగు లేదు. ఎటొచ్చీ ఏనుగు మీద వేట నీకు కొత్త. టేక్ స్టెడీ ఎయిమ్. విష్ యు గుడ్‌లక్" అని సూచనలిస్తూ తండ్రీకొడుకులు విడిపోయారు.

బీటర్లు గాలిలో తుపాకులు పేలుస్తూ, డప్పులు కొట్టుకుంటూ, టపాకాయలు పేలుస్తూ, అరుచుకొంటూ జంతువుల్ని వేటగాళ్ళ వైపు తోలుకొస్తున్నారు. ఏనుగులు నిశ్శబ్దంగా మెడబంటి ఏనుగుగడ్డిలోంచి నడుస్తూ జంతువుల్ని అడ్డుకోవటానికి వలయాకారంగా ఏర్పడుతున్నాయి. చికాకుపరుస్తున్న గడ్డి దోమల్ని ఈగల్ని చేటల్లాంటి పెద్ద చెవుల్తో తోలుకుంటున్న చప్పుడు స్పష్టాస్పష్టంగా వినిపిస్తోంది. అప్పుడప్పుడు మావటివాళ్ళ మందలింపులు.

బీటర్ల అరుపులు, సందడి మరింత దగ్గరవుతోంది. తుపాకీ కాల్పులు ఆపేశారు. ఏనుగులు తొండాల్ని పైకెత్తి రాడార్‌లా తిప్పుతూ జంతువుల వాసనల్ని పసిగట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. వేటగాళ్ళు రైఫిళ్ళ సేఫ్టీ కేచ్‌లు నొక్కి వేటకు సర్దుకుంటున్నారు. గాలికి కదులుతూ ఒంటిని గీరుకొంటున్న ఏనుగుగడ్డిలో నుంచి ఏనుగుల మీద ఊగుతూ బైనాక్యులర్స్ లోంచి అడవిని కలయ చూస్తున్నారు.

మధ్యాహ్నం కావస్తోంది. ఎండ తీవ్రత ఎక్కువవుతోంది. ఇహ వేట..... గడ్డిలో నుంచి, అడవిలో నుంచి కంగారు కంగారుగా జంతువులు అటూ ఇటూ పరుగెత్తుతూ పారిపోబోతున్నాయి. ఏనుగులు వాటిని అడ్డుకొంటున్నాయి. అడవిలో రేగిన కలవరానికి నెమళ్ళు బెదరుగా అరుస్తూ ఎగిరిపోతున్నాయి.

"ధన్" - చిరుతపులి పడిపోయింది.

"ధన్, ధన్, ధన్." గడ్డిలో నుంచి గెంతుతూ ఎగిరిపోతున్న లేళ్ళు గాలిలోనే బులెట్ షాట్స్‌కి తుళ్ళిపోయి చచ్చి గడ్డిలో పడిపోయాయి. దెబ్బతిన్న ఎలుగుబంటి 'గుర్ గుర్ గుర్' మంటూ పారిపోతోంది. గుండుదెబ్బకు పొదల్లో ఒరిగిపోయిన కణుసు కంచుగొట్టంలో నుంచి అరిచినట్లు 'బ్రార్ బ్రార్' మని అరుస్తూ డెక్కల కాళ్ళనూ, పలవల కొమ్ములతోనూ మరణ వేదనతో గిలగిలా తన్నుకొంటూ ఇంకా ఏదో ఆశతో గింజుకుంటోంది.

రవీంద్ర ఏనుగు 'రాణి' నడుస్తున్నదల్లా ఆగి అనుమానంగా ఒక అడుగు వెనక్కు వేసింది. తలను పిచ్చిగా అటూ ఇటూ ఆడిస్తోంది. ఎర్రటి చీకికళ్ళు ఎండలో మరింత ఎరుపెక్కి గడ్డిలో కదలికల్ని తీక్ష్ణంగా వెతుకుతున్నాయి.

రవీంద్ర మౌజర్ రైఫిల్‌ను ఖడ ఖడమంటూ బోల్టును షఫిల్ చేశాడు. 'రాణి' పులిని చూసింది. కొండలా గడ్డిలో నుంచి దూసుకుంటూ పులిని చార్జ్ చేసింది. పులి! ఒకే ఒక్క అరుపు. అడవి ఊగిపోతోందా అనిపించింది. గడ్డిలో నుంచి ఎక్కుపెట్టి విడిచిన బాణంలా ఏనుగు మీదికి దూకింది.

రవీంద్ర మెరుపువేగంతో రైఫిల్ పేల్చాడు. ఏనుగు కుదుపుకు అంబారీ ఊగిపోతోంది. పులి అరుపుతోనూ, తుపాకీ శబ్దంతోనూ అడవి దద్దరిల్లిపోతోంది. తుపాకీ దెబ్బకు ఎత్తిపారేసినట్లు పులి పల్టీ కొట్టి వెనక్కు తుళ్ళి ఆమడ దూరంలో గడ్డిలో పడిపోయింది.

"గిర్ గయా సాబ్" అంటూ పులి పడిన చోటికి 'రాణి'ని మావటివాడు దౌడు తీయించాడు. 'రాణి' ఆ ప్రాంతాన్నంతా కలయవెతికేస్తోంది. గడ్డిని పాదాల్తో తొక్కేస్తూ, తొండంతో చిందర వందర చేస్తూ వెతికేస్తోంది. పులి కనిపించటంలేదు. రవీంద్ర లోడెడ్ రైఫిల్‌తో అంబారీ దిగబోతున్నాడు. అంతే! క్షణంలో వెనక నుంచి మరో అరుపు. ప్రతీకార జ్వాలతో మరిగిపోతున్న దెబ్బ తిన్న బెబ్బులి ప్రళయ గర్జన. ఎర్రటి ఎండలో పచ్చగా మెరుపు మెరిసినట్లు ఏనుగు మీద పడి రక్కేస్తూ అంబారీని పంజాతో ఒక్క ఊపున లాగేసింది. క్షణంలో అంబారీతోపాటు రవీంద్ర కింద పడిపోయాడు. లేవబోయాడు. ఎలుకను పిల్లి విదిలించినట్లు నోటితో రవీంద్ర తొడలు పట్టుకొని విదిలిస్తోంది. ఎముకలు విరిగిపోతున్నాయి. మాంసం ముద్దలు ముద్దలుగా ఊడిపోతోంది. నెత్తురు పిచికారీ చేసినట్లు ఆకుపచ్చ గడ్డి మీద తెరలు తెరలుగా చిమ్ముతోంది. పులి తన రక్తంతోనూ, రవీంద్ర రక్తంతోనూ నిండిన నోటితో తెల్లటి కోరలు చాచుకుంటూ పచ్చగడ్డి వెలుగు నీడల్లో తన పచ్చటి కళ్ళు మరింత క్రౌర్యాన్ని సంతరించుకుంటుండగా మరో పెడబొబ్బ పెట్టి రవీంద్ర మీదికి వస్తోంది. ఆ అరుపులో సెగలు కక్కుతున్న నెత్తురు పొగలు రవీంద్ర ముఖానికి గుప్పున ఆఖరిసారిగా తగలటం మాత్రం తెలుసు.

తరువాత అంతా చీకటి. రవీంద్ర స్పృహ తప్పిపోయాడు. గవర్నమెంట్ హాస్పిటల్‌లో తెలివొచ్చింది. బ్యాండేజి చేసిన, పులి నమిలేసిన కాలు వేలాడదీసుంది. భరించరాని బాధ. కెవ్వున కేక వేసి మళ్ళీ తెలివి తప్పిపోయాడు.

చాలా రోజులకు మళ్ళీ తెలివొచ్చింది, లండన్ హాస్పిటల్లో. కుడికాలు లేదు.

అలా గత స్మృతుల్ని నెమరు వేసుకొంటూ శూన్యంలోకి చూస్తున్నాడు. కొండల్లో నుంచి మెరుగు పెట్టిన రాగిపళ్ళెంలా సూర్యుడు ఉదయిస్తున్నాడు. పిట్టలు అరుస్తున్నాయి.

కింది గదిలో నుంచి విజిల్ వినిపించింది. రవీంద్రకు పిలుపు. "యస్, కమింగ్" అంటూ గబగబా కుంటుకుంటూ మెట్లు దిగి బెడ్‌రూమ్‌లోకి అడుగు పెడ్తూనే, "గుడ్‌మార్నింగ్, ప్రిన్సెస్. ఎట్ యువర్ సర్వీస్, ప్లీజ్" అన్నాడు.

చేతిలో వెండి విజిల్ పట్టుకొని, అరవై సంవత్సరాలు దాటిపోయి అనారోగ్యంతో వడలిపోయిన యువరాణి చంద్రకళ కటిక బల్లమంచం మీద పడుకొనుంది. ఆర్థరైటిస్‌తో బాధపడుతూ కదలలేని స్థితి.

రవీంద్ర టేబుల్ మీద ఖాళీ కప్పును చూసి "మీరు టీ అప్పుడే తాగేశారా" అని అడిగాడు మంచంమీద కూర్చుంటూ.

"రాత్రంతా నిద్రలేదు. గాబరాగా ఉంటేనూ రసూల్‌ని నేనే టీ తెమ్మన్నాను."

"నో, మై డియర్ బేబీ! విజిల్ వెయ్యవలసింది. నేనే టీ తాగించేవాడిని కదా" అని సున్నితంగా మందలించాడు.

చంద్రకళ కళ్ళు మూసుకొని నవ్వుకుంది. రవీంద్ర చంద్రకళకు సర్వ సపర్యలతో పాటు స్నానపానాదుల్ని కూడా తనే స్వయంగా చేస్తాడు.

కొండల్లో పులి అరుపు మళ్ళీ గాలిలో తేలి స్పష్టాస్పష్టంగా వినిపించింది. చంద్రకళ గబాలున కళ్ళు తెరిచి "పులి అరుపులా ఉంది. రాత్రి కూడా అరుస్తోంది. మీరు గదిలో చదువుకుంటున్నారు" అంది.

"లేదు. డాబా మీదికి వెళ్ళి బాల్కనీలో నిల్చొని ఆ అరుపులు చాలాసేపు విన్నాను. సింప్లీ మ్యూజికల్" అన్నాడు రవీంద్ర.

చంద్రకళ అప్రయత్నంగా రవీంద్ర కట్టెకాలును నిమురుతూ అంది: "ఆ అరుపులు వింటుంటే నాకు గుండె దడ. ఈ రోజు మీరు ఈ స్థితిలో ఉండడానికి కారణం ఆ అరుపే. పెళ్ళయిన కొత్త రోజుల్లో నన్ను అస్సాంలో ట్రావెలర్స్ బంగళాలో ఉంచేసి మీరు పులివేటకు బయలుదేరారు."

"టేక్ ఇట్ ఈజీ. మై డియర్. అసలైన కాలు కంటే ఈ కర్రకాలు ఎంత మెజస్టిక్‌గా ఉందో చూడు" అని కట్టెకాలు మీద బెత్తంతో ఠక్ ఠక్ మని కొట్టి చూపుతూ, "నా కుంటి నడకను ప్రిన్స్లీ లింప్ అనో, కెప్టెన్ ఆహాబ్ ఆఫ్ మాబీడిక్ అనో ఆక్స్‌ఫర్డ్‌లో అమ్మాయిలు గిగిలిస్తూ వెంటబడేవారు" అన్నాడు.

"ఎవర్తో ఒక దొరసాన్ని ఎంచుకోవలసింది" అని నవ్వబోయి ఒత్తిగిలి ఒళ్ళు సర్దుకోబోయింది. బాధతో విలవిలలాడిపోతూ మూలిగింది. కీళ్ళ నొప్పులు ప్రాణం తోడేస్తున్నాయి. ఆ బాధను చూడ లేక రవీంద్ర తమాయించుకొని మాట మార్చి జోక్ విసిరాడు. "అప్పటికే ఈ దొరసాని నన్ను కట్టేసుకుందిగా" అని పక్కున నవ్వాడు.

"ఎందుకండీ మాట మారుస్తూ ఆనందాన్ని నటిస్తారు? రోగం నాకు కాదు. నాకు నానా సేవలు చేస్తూ సగం అయిపోయారు ఈ వయసులో" అని వలవలా ఏడ్చింది.

ఒకనాడు కోటలో విద్యుల్లతలా మెరిసిన చంద్రకళ, రంగు రంగుల ఫ్రెంచి శాండ్లియర్స్ కాంతిలో, ప్రత్యేకంగా విదేశాలలో తయారుచేయించిన హంసతూలికాతల్పాల్లాంటి మెత్తటి పరుపుల మీద పవళించిన మంచుబొమ్మ లాంటి చంద్రకళ ఈనాడు చెక్కబల్ల మీద రోగం తో జీర్ణించుకుపోయి అతుక్కుపోయింది. అలా ఆమెలో ఒకనాటి అందాన్ని చూస్తున్నాడు. తడారిన పెదాల్ని నాలుకతో తడుపుకొంటున్నాడు.

ఆ కోట పాడువడి శిథిలావస్థలో అలనాటి రాచరికానికి ప్రతీకగా నిలిచింది. రాచరికాలు పోయాయి. రాజులు పోయారు. అడుగంటి పోతున్న ఆశలతో, అవశేషంగా మిగిలిన ఆస్తితో ఆ పక్కనే రాజ ప్రాసాదం నమూనాలో బంగళా కట్టించుకున్నాడు. పిల్లలు లేరు. ఆ వృద్ధ దంపతులే ఆ వంశానికి ఆఖరి వారసులు.

రెండుసార్లు విజిల్ వేసింది చంద్రకళ. "అయామ్ సారీ - రసూల్, బాత్‌రూమ్‌లో స్నానానికి వేణ్ణీళ్ళు పెట్టు - మేమ్ సాబ్‌కు స్నానం చేయిస్తాను. డియర్ మేడమ్, బెతోవెన్ మ్యూజిక్ వినండి. ఉదయాన్నే స్నానం చేస్తూ వింటే హాయిగా ఉంటుంది" అంటూ గదిలో మూలగా ఉన్న గ్రామఫోన్ పెట్టాడు. చంద్రకళను కదలకుండా చేతుల మీద ఎత్తుకొని బాత్‌రూమ్‌లోకి తీసుకువెళ్ళాడు.

బాత్‌రూమ్‌లో ఫ్లష్, షవర్, వేడి నీటి ఆవిర్లలో తేలుతున్న ఇంగ్లీషు సబ్బు నురుగుల వాసనలు. యువ రాణిని స్నానం చేయిస్తూ కూని రాగంతో వెస్టర్న్ ట్యూన్ ఈల వేస్తు న్నాడు, పిల్లను లాలిస్తున్న తల్లిలా.

కీళ్ళ కదలికలకు బాధపడుతున్న చంద్రకళను - "నో! అయిపోయింది. జస్ట్ ఎ మినిట్ - కదలకూడదు" అని బుజ్జగిస్తూ, ఒళ్ళంతా తుడిచి పొత్తిళ్ళలో పిల్లను ఎత్తుకువచ్చినట్లు తెచ్చి బల్లమీద పడుకో బెట్టాడు. చంద్రకళ తెల్లటి చర్మం నీటి బిందువులతో మెత్తబడి నలిగిపోయిన ఉల్లిపొర కాగితంలా ఉంది. స్నానాయాసంతో కళ్ళు మూసుకుంది.

గదిలో గ్రామఫోన్ మీద బెతోవెన్ 'మూన్‌లైట్' సొనాటా మెలోడియస్‌గా తేలుతోంది. అనారోగ్యంతో బాధపడుతున్న చంద్రకళకు ఆ మ్యూజిక్ తలకెక్కడం లేదు సరికదా చిరాకు పెట్టేస్తోంది. గేల గేలగా ఉంది. నీరసించిపోయిన గుండె దడగా ఉంది. విసుగ్గా కళ్ళు తెరిచింది. ఎదురుగా చచ్చిపోయిన పులి ఫోటో గోడకు వేలాడుతోంది. దాన్ని చూచిన వెంటనే గుండె మరింత వేగంగా కొట్టుకుంటోంది.

"ఆ పులి బొమ్మ తీసెయ్యండి, ప్లీజ్. మీరు ఈ స్థితికి రావడానికి కారణం అయిన ఆ పులి' ఫోటోను గదిలో ఉంచుకొని అనుక్షణం ఆ భయంకర క్షణాల్ని నెమరువేసుకొంటూ ఎందుకు ముచ్చట పడిపోతూంటారో ఈనాటికీ నాకు అర్థం కావడం లేదు. మూడు సంవత్సరాలు లండన్‌లో మృత్యువుతో పోరాడి కట్టెకాలుతో హాస్పిటల్ నుంచి బయటపడ్డారు. ఆ ఫోటోను తీసెయ్యండి. ఈ కీళ్ళజబ్బుతో పాటు గుండెజబ్బు కూడా వచ్చిందని డాక్టర్లు చెప్పాలా? బతికుండగా మీ కాలు నమిలేసింది. చచ్చి బొమ్మగా మారి నా గుండెను కొరికేస్తోంది" అని కోపంగా తీంట్రించుకొని అరిచింది. ఇంకా అరవబోయింది. ఆ అరుపులు స్వరపేటికలోనే చిట్లిపోయినట్లు కీచుపోయాయి.


బెతోవెన్ రికార్డు అయిపోయింది. గ్రామఫోన్ పిన్ను గరగర గీసుకొంటోంది. రవీంద్ర వెళ్ళి గ్రామఫోన్ ఆపు చేశాడు. ఎప్పుడూ లేని చంద్రకళ కోపానికి నిశ్చేష్టుడై నుదుటి మీద చెమటను ఎడమ చేత్తో తుడుచుకుంటూ మెల్లగా వచ్చి పక్కన కూర్చున్నాడు.

"డియర్ డెయిసీ, డోంట్ బి ఎక్సయిటెడ్. పులి ఫోటోలాగ ప్రతిబంధకంగానూ, అసహజంగానూ ఉన్న నా ఈ కట్టెకాలును కూడా తీసెయ్యమంటారా? ఈ కాలుకి, ఆ పులికి అవినాభావ సంబంధం ఉంది. ఇది పులి కొరికేసిన కాలు. అది చచ్చిపోయిన పులి ఫోటో. రెండూ నిర్జీవానికి ప్రతీకలే గాని, అవి సజీవంగా నేను కన్ను మూసేవరకూ నాలో మెదలుతూ ఉంటాయి. ప్రత్యర్థిని గౌరవించటం, ప్రత్యర్థి గొప్పతనాన్ని శ్లాఘించటం రాచరికపు లక్షణం. నన్ను మట్టుబెట్టడానికి చివరిసారిగా పులి పెట్టిన పెడబొబ్బ, దూకబోతున్న ఆ దృశ్యం తలుచుకొంటుంటే ఒళ్ళు కంపించిపోతోంది. అదే సమయానికి పక్కనే ఉన్న వేట ఏనుగు 'సీజర్' దాన్ని అమాంతంగా తొండంతో అందుకొని వెదురు బొంగును చీరేసినట్లు చీల్చుతూ, పాదాల కింద తొక్కేసి నలిపెయ్యక పోయుంటే నేను ఈపాటికి ఉండేవాడిని కాదు. దెబ్బ తిని, పడిపోయి గడ్డిలోంచి పాకుకుంటూ, నక్కుకుంటూ నా ఏనుగును దాటనిచ్చి వెనక నుంచి ఎగిరి దెబ్బ తీసింది. హౌడాతో కూలిపోయాను. పులి వేసిన ఎత్తుకు చిత్తయిపోయాను. అయామ్ డిఫీటెడ్...."

"అబ్బా, ఇంకా ఎంత చెబుతారండీ, ఆ పులి గొప్పతనం - అబ్బా" అని విసుగ్గా కళ్ళు మూసుకొని వింటోంది. రవీంద్ర ఆ మాటల్ని గమనించకుండా ఏదో పూనకంలో ఉన్నట్లు చెప్పుకుపోతున్నాడు. "మనిషి చచ్చినా పరవాలేదు. ఓడిపోకూడదు. నేను ఓడిపోయాను. కానీ, నా ఓటమి ఎ గ్లోరియస్ డిఫీట్. హేట్సాఫ్ టు ది కింగ్ ఆఫ్ ఇండియన్ జంగిల్. దాని పట్ల నాకు శత్రుత్వం గాని, పగ గాని లేదు. ఐ ఎడ్మైర్ ఇట్."

"రాను రాను మీకు పులి మీద కవిత్వం పిచ్చి కూడా ఎక్కువౌతోంది. మీరు ఆక్స్‌ఫర్డ్‌లో నేర్చిన విద్యంతా మీకు సర్వకష్టాలు తెచ్చిపెట్టి, శారీరకంగా నాశనం చేసి, శాశ్వతంగా అవిటివాడిని చేసిన ఆ పులిని పొగడ్డంతో సరిపోతోంది."

"కష్టాలా! అవి కష్టాలా! నో-నో-నో —నా కట్టెకాలు, నీ అనారోగ్యం, అంతరించిపోయిన మన రాజభోగాలు, రాజ్యాధికారాలు, ఆర్థిక దుస్థితి - ఇవన్నీ జీవితంలో అవరోధాలు, ఆటంకాలు, తాత్కాలికమైన ఇబ్బందులు. అంతే - ఇవన్నీ కాల గతిలోనో, చరిత్రగతిలోనో వాటంతట అవే సర్దుకుంటాయి. లేకపోతే మనమే జీవితంతో రాజీపడిపోయి సర్దుకుంటాం. అవి నిజమైన కష్టాలు కావు. నిజమైన కష్టాలు చావుతోనే తీరతాయి. మరో విధంగా తీరేవి అసలు కష్టాలే కావు. అవి కేవలం కష్టాలని మనం ఊహించుకుంటున్న మిథ్యాబింబాలు. అసలైన కష్టానికి నివారణోపాయం



మంచులాంటి చావు షాక్ నరనరాల్లోనుంచి జివ్వున కొట్టింది.

## దేవేరికి ఫేర్‌వెల్ శాల్యూట్ చేస్తున్నట్లు తుపాకీ 'ధన్' మని పేలింది.



ఒక్కటే! చావు" అని హెమింగ్వే ఫిలాసఫీని మదింపు చేసుకున్న రాజర్షిలా భార్యవైపు చూసి చిరునవ్వు నవ్వాడు.

"మీరు కోరినట్లే ఈ గదిలో నుంచి పులి ఫోటోను తీసేసి నా గదిలో పెట్టుకుంటాను. మీరు అనవసరంగా గతాన్ని తలుచుకొంటూ మనసు పాడు చేసుకోకండి. హాయిగా నిద్రపొండి" అని మాత్రలు, మందు తాగించి, తువాలుతో మూతి తుడిచి దుప్పటి కప్పాడు. "నిద్ర లేవగానే విజిల్ వెయ్యండి. బై బై" అని పులి పటాన్ని తీసుకొని తన గదిలోకి వెడుతూ "రసూల్, మేమ్ సాబ్‌కు కేవలం బ్రెడ్ టోస్ట్, వెజిటబుల్ సూప్ తయారుచెయ్యి" అని కేకవేశాడు.

ఎదురుగా గోడకు పులి ఫోటో తగిలించి మంచం మీద రిలాక్సింగ్‌గా పడుకున్నాడు. కిటికీ లోంచి ఎండలకు కమిలిపోయిన నల్లటి కోట శిథిలాలలో నుంచి అప్పుడప్పుడు గాజుపెంకులు మెరుస్తున్నాయి. పాత మట్టి వాసన గాలిలో తేలుతోంది.

రవీంద్ర సాలోచనగా నున్నటి గడ్డాన్ని నిమురుకొంటూ ఏమీ తోచక పక్కన బుక్‌షెల్ఫ్‌లో చేతికి అందిన పుస్తకం తీశాడు. తన ఆలోచనలకు తగిన పుస్తకం అనుకోకుండా తగిలింది. 'ఓల్డ్ మేన్ అండ్ ది సీ' - హెమింగ్వేది. తన రచనా సరళిలో 'రఫ్ గ్రై'గా పేరొందిన మహా రచయిత ఈ నవలను వచన కవిత్వంలా మలచాడు. నవలలో సముద్రం తల్లిలాగా, ప్రియురాలిలాగా రకరకాల మూడ్స్‌లో సాక్షాత్కరిస్తుంది. ఊపిరి తీసుకుంటున్న సముద్రపు పొంగులు. వెన్నెలలో పోటెక్కిన సముద్రపు మూల్గులు. సముద్రం మీద పడవలో శాంటియాగోలో రాత్రింబగళ్ళు చేపల వేట, గాలం విసరడం, చేపకు ఎర చూపడం, కవ్వించడం, అలవగొట్టడం, గాలం తాడు లాగుతున్నప్పుడు బొబ్బలెక్కి, నెత్తురు చిమ్ముతున్న బలమైన చేతులు, ఆ అలసట... రవీంద్రకు 'మాబీడిక్'లో కెప్టెన్ అహాబ్ కంటే శాంటియాగో అంటేనే అభిమానం. తిమింగిలాన్ని వేటాడిన అహాబ్‌లోలాగ శాంటియాగోలో కసి గాని, ప్రతీకారం గాని లేదు. తనను సముద్రపు వేటలో ముప్పుతిప్పలు పెట్టిన చేపను తన సమ ఉజ్జీగా గౌరవించి, ప్రేమించి వేటాడాడు. నవల లోని సాహసోపేత సౌందర్య దృశ్యాల్ని మననం చేసుకొంటూ తన్మయత్వంతో ఒళ్ళు మరిచిపోయాడు. ఆ మత్తులో చంద్రకళ విజిల్ వినిపించినట్లయింది. చాలాసేపటి నుంచి విజిల్ వేస్తోంది.

గబగబా తేరుకొని గదిలోకి వెళ్తూ "సారీ, డియర్. ఐ బికేమ్ క్రేజీ ఆఫ్ హెమింగ్వే - చాలా సేపటి నుంచి పిలుస్తున్నారా? డార్లింగ్, ఈ రోజు నుంచి నన్ను మీరు హెమింగ్వే అని పిలవండి. ఐ లైకిట్, ప్లీజ్" అని రిక్వెస్ట్ చేస్తూ చంద్రకళ దగ్గరకు వెళ్ళబోతూ ఠక్కున ఆగాడు. మంచం పక్కనే నేల మీద పడున్న విజిల్ కట్టెకాలుకు ఠక్‌మని తగిలి ఎవరో కుదిపినట్లయింది. విజిల్ చేత్తో పట్టుకొని, "ప్రిన్సెస్ డియర్, గెటప్ ప్లీజ్" అంటూ విజిల్ వేశాడు.

నిశ్శబ్దం. కళ్ళలో అనుమానం. ఆత్రతతో చంద్రకళ చెయ్యి పట్టుకున్నాడు. మంచులాంటి చావు షాక్ నరనరాల్లో నుంచి జివ్వున కొట్టింది.

చంద్రకళ పక్కన కూర్చున్నాడు. "మై ఏంజిల్, హౌ క్రూయల్ యు ఆర్?" అని అప్రయత్నంగా గదంతా ఆలోచనలు మందగించిన చూపులతో వెతుకుతున్నాడు. బెత్తంతో కట్టెకాలు మీద ఠక్ ఠక్‌మని కొట్టుకుంటూ దాని రియాక్షన్ కోసం వెర్రి చిరునవ్వుతో చంద్రకళ ముఖంలోకి చూస్తున్నాడు. ఊపిరి తీసుకుంటున్న సముద్రంలా లేదు. ఇంకిపోయిన సముద్రంలా ఉంది. విజిల్ ఊదాడు - మళ్ళీ ఊదాడు.

రసూల్ "జీ హుజూర్" అంటూ వచ్చాడు.

"చప్పుడు చెయ్యకు - యువరాణీ వారు నిద్రపోతున్నారు" అన్నట్లు నోటికి వేలు అడ్డం పెట్టుకొంటూ రసూల్ భుజం మీద చెయ్యి వేసి ఆనుకొంటూ దూరంగా తీసుకువెళ్ళి "గాన్ టు ఫారాఫ్ పెవిలియన్ - వెళ్ళిపోయారు యువరాణీ గారు. శాశ్వతంగా నిద్రపోతున్నారు" అని అంటున్నప్పుడు గొంతు జీరతేరింది. పెదాలు వణకుతున్నాయి. కట్టెకాలు బేలెన్సు తప్పినట్లు ఒరిగిపోతోంది.

"హుజూర్, డాక్టర్‌కు...."

"అవసరం లేదు. అంతా అయిపోయింది. రేపు తెల్లారేవరకు ఈ సంగతి బయటికి తెలియనివ్వకు - నన్ను ఈ రాత్రంతా ఒంటరిగా వదిలెయ్యి. వెళ్ళు" అని చెయ్యి ఊపుతూ బెత్తాన్ని చేతికర్రలా ఊత పట్టుకుంటూ, తూలుకుంటూ చంద్రకళ మంచం దగ్గరికి నడిచాడు. తనివితీరా చంద్రకళను చేతుల్తో తడిమాడు. చాలాసేపు కన్నీరు ఎండిపోయిన కళ్ళతో మౌనంగా భార్య పక్కన కూర్చున్నాడు. ఏవో ఆలోచనలు... లేచి కుంటుకుంటూ గది మధ్యలో నిల్చున్నాడు. కిటికీ వెనీషియన్ బ్లయిండ్స్‌లోంచి అస్తమిస్తున్న సూర్యకాంతి గదిలో పడుతోంది - ఆ మసక వెలుగులో.

"రాణీగారు వెళ్ళిపోయారు." కిటికీలో నుంచి అస్తమిస్తున్న సూర్యుడికి చెబుతున్నట్లుంది.

"ఇక తిరిగి రారు." తనకు తానే చెప్పుకుంటున్నట్లు గొణుక్కుంటున్నాడు. "నన్ను విడిచిపెట్టి ప్రిన్సెస్ వెళ్ళిపోయారు." గదిలో ఆవరించుకున్న నిశ్శబ్దానికి రహస్యంగా చెవిలో చెబుతున్నట్లు గుసగుసమన్నాడు.

రవీంద్ర జీవితంలో ఒక అధ్యాయానికి శాశ్వతంగా చీకటి తెర పడింది.

బయట పిండారబోసినట్లు వెన్నెల.

చీకటి గదిలో రవీంద్ర కట్టెకాలుతో కుంటుకుంటూ పచార్లు చేస్తున్నాడు. కిటికీలో నుంచి వెన్నెల చంద్రకళ మృతదేహం మీద పడుతోంది. చావు నిశ్శబ్దం ఆవరించి ఉన్న గది నుంచి అప్పుడప్పుడు రవీంద్ర ఊదుతున్న విజిల్ చీకట్లో చిట్లుతున్నట్లు వినిపిస్తోంది. నిశ్శబ్దం. కర్రకాలు కిర్రు చప్పుడు - విజిల్ పిలుపు అందుకున్నట్లు కోటలో నుంచి కోయిల కూసింది. చంద్రకళ పిలుస్తోందేమో! కిటికీ అద్దాల మీద అల్లుకొన్న తీగెల వెన్నెల నీడలలో నుంచి రాజప్రాసాదం మసకగా కనిపిస్తోంది. అది అలనాటి రవీంద్ర రాజమందిరం. పిలుస్తోంది.

గబగబా కుంటుకుంటూ తలుపులు తెరుచుకుని బయట నౌకర్ని కూడా గమనించకుండా, వేట నుంచి తిరిగి వచ్చిన పులి విశ్రాంతి తీసుకోవడానికి గుహలోకి వెళ్తున్నట్లు చీకట్లను దాటుకుంటూ శిథిల రాజప్రాసాదంలోకి వెళ్ళాడు.

గజశాలలలో నుంచి, అశ్వశాలలలో నుంచి చీకట్లో తడుముకుంటూ నడుస్తున్నాడు. వెన్నెల తడుస్తున్న ప్రాసాద మండపాల్లో నుంచి, అంతఃపుర ప్రాంగణాల్లోనూ, విలాసమందిరాల్లోనూ, ఎండిపోయిన ఉద్యానవనాల్లోనూ ఆ రాత్రంతా ఒంటరిగా కట్టెకాలును ఈడ్చుకుంటూ తిరుగుతున్నాడు.

వేగుచుక్క పొడిచింది. వెన్నెలకు వెండి పోసినట్లు దేదీప్యమానంగా ఉంది. కోట బురుజు మీద రవీంద్ర కింది నుంచి చూస్తే వెన్నెలలో చెక్కిన నల్లటి గ్రీక్ పాలరాతి శిల్పంలా ఉన్నాడు.

చేతిలో తుపాకీ కూడా ఉంది. మౌజర్ రైఫిల్. చంద్రకళ గదివైపు విజిల్ ఊదాడు. నిశ్శబ్దం. దేవేరికి ఫేర్‌వెల్ శాల్యూట్ చేస్తున్నట్లు తుపాకీ 'ధన్'మని పేలింది. గబ్బిలాలు కీచుకీచుమంటూ శిథిలాల్లో నుంచి గుంపులు గుంపులుగా లేస్తున్నాయి.

కోట బావురుమని అరిచింది.

విజిల్ బురుజు మీద నుంచి సింహద్వారం మీద పడి దొర్లుకుంటూ కింద పడిపోయింది.

ఎక్కడో సుదూరంలో ఉవ్వెత్తున లేచిన నెత్తుటి కెరటం చీకట్లో తీరాన్ని ఢీకొని నురుగులు కక్కుతూ చరిత్ర సైకతాల్లోకి ఇంకిపోయింది. ■